

# ఏ పేరుతో పిలవను?

భాగవతుల లలితశర్మ

గేటు చప్పుడైతే కిటికీలోంచి బయటికి చూశాను. పరమేశం లోపలి కొస్తూ కనబడ్డాడు. రాస్తున్న కాగితాలు పక్కకి. నెట్టి "రావేయ్" అన్నాను చిరునవ్వుతో.

పరమేశం తిరిగి నవ్వలేదు. సైలెంట్‌గా ఓ నమస్కారం పెట్టి, నా కెదురుగా కూర్చున్నాడు.

అత నెందుకొచ్చాడో అర్థమైపోయింది నాకు. చిరునవ్వుతో వచ్చాడంటే - ఏదో సరదాగా కబుర్లకి అనుకోవచ్చు. సీరియస్‌గా వస్తే మాత్రం - 'అందుకే' అనుకోవాలి మరి. స్వానుభవంతో తెలుసుకున్న విషయం ఇది.

కూర్చున్న కాసేపటికి అడిగాను - "ఎలా ఉంది ఆమెకు?"

"ఏమీ బాగులేదు. తీసుకుంటున్న మందు లన్నీ ఏమైపోతున్నాయో?" నిస్పృహ ధ్వనించింది అతని మాటల్లో.

"డాక్టర్ రేమంటున్నాడు?"

"తను చెయ్యగలిగిందేమీ లేదంటున్నాడు."

వరమేశం అక్కడున్న మేగజిన్ తిరగెయ్యసాగాడు. నేను ఆలోచనలో పడ్డాను. నెలాఖరు. నా దగ్గరున్నవే ఏభై రూపాయలు. ఇంకెవరైనాయితే ఏమో ! వరమేశానికి అంటే ఇవ్వకుండా ఉండలేను. లేచి, బీరువాలోంచి డబ్బు తీసి అందిచాను. వరమేశం తనలో అనుకుంటున్నట్టూ అన్నాడు - "మీ దగ్గర ఇలా తీసుకోవడం... బహుశా, ఇదే ఆఖరు - ఇకమీదట అవసరం పడకపోవచ్చు."

వరమేశంతో పరిచయం అయాక, అతను మా ఇంటికి మొట్టమొదటిసారి డబ్బుకోసం రావడం నా కింకా జ్ఞాపకమే. ఓ రోజు ఉదయాన్నే - "గురువుగారూ నమస్కారం" అంటూ వచ్చాడు.

చాకులాటి కుర్రాడు. సాహిత్యాభిమాని. ఒక్క సాహిత్యమే కాదు - ఏ రంగం గుంచైనా సరే అనర్గళంగానూ, ఆకర్షణీయంగానూ మాట్లాడగలడు. ఆ రోజు - మాట్లాడుతున్నాడే గాని, దేనికో ఇబ్బందిగా ఫీ లవుతున్నట్టూ అనిపించింది నాకు. ఓ అరగంట తరువాత, నెమ్మదిగా పైకి తేలాడు.

"మాస్టారు, ఓ ఏభై రూపాయలు కావాలి - అర్జంటుగా" అన్నాడు మొహమాట పడ్తూ.

"ఎందుకూ" అని అడక్కుండానే తీసి ఇచ్చాను. కృతజ్ఞతలు చెప్పుకొని వెళ్ళిపోయాడు.

అలా మరోసారి - మరోసారి... తీసుకెళ్ళడమే, గాని, మరి తిరిగి ఇవ్వడం అంటూ ఉండదు. వరమేశం ఆర్థిక పరిస్థితి నాకు బాగా తెలును. స్థిరమైన ఉద్యోగం అంటూ ఏమీ లేదు. హైస్కూలు అయిపోగానే చదువుకి స్వస్తి చెప్పేశాడుట. అప్పట్నుంచి ఏవేవో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుతున్నాడు.

"ఒంటరి బతుకు. ఎంతొచ్చినా చాలు" అంటాడు. అతని కెవరూ లేరుట. లేకుండా ఎలా ఉంటారు? ఇంట్లో పోట్లాడి వచ్చాశాడేమో - అతని వ్యక్తిగత విషయాలు నా కంతగా తెలీదు. నేను మధ్య తరగతికి చెందినవాడిని. ఎంత డబ్బుని సర్దగలను? "మీ ఋణం తీర్చుకోగలిగేది కాదు !" అంటాడు భావయుక్తంగా. ఆఖరికి ఓ రోజు ఊరుకోలేక అడిగేను.

"ఎన్నాళ్ళిలాగ? ఏదేనా మంచి ఉద్యోగం చూసుకోరాదూ?" నా గొంతులో అనుకోకుండా విసుగు ధ్వనించింది.

అతను చిన్నబోయిన ముఖంతో అన్నాడు - "నా గురించి కాదు... ఆవిడ... ఆవిడ ఆరోగ్యం బాగులేదు... ట్రీట్‌మెంట్ కని..."

"ఆవి డెవరు?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఎవరూ అని నిలదీసి అడిగితే - ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు..." చిన్నగా గొణిగాడు.

"ఎలా చెప్పడం ఏమిటి? అమ్మో, అత్తో, అక్కో, చెల్లో, వదినో, మరదలో - ఎవరో ఒకళ్ళవొచ్చు కదా."

"వీళ్ళెవరూ కాదులెండి" అన్నాడు ఇబ్బందిగా నవ్వుతూ.

"అయితే, స్నేహితురాలో... ప్రియురాలో..."

"అబ్బే... అదేం కాదు..." అన్నాడు ననుగుతూ. నాలో సహనం చచ్చిపోయింది.

"ఎవరూ కాకపోతే, నీకేం పట్టిందయ్యా, ముక్కూ మొహం తెలియని వాళ్ళకి, అప్పు చేసి మరీ వైద్యం చేయించడానికి?"

వరమేశం మాట్లాడలేదు. నేలవేపు చూస్తూ గంభీరంగా ఉండిపోయాడు. కొంతసేపటికి తలెత్తి నా ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగేడు - "క్షమించండి - ఇలా అడుగుతున్నందుకు. కష్టాల్లో ఉన్న ఓ వ్యక్తిని ఆదుకోవాలంటే మనం ఆ వ్యక్తికి ఏదో ఒకటి అయితీరాలా? ఏ రకమైన సంబంధమూ లేని వాళ్ళకి తోటి మనిషిగా సహాయపడ్డానికి వీలులేదా?"

ఊహించని ఈ ప్రశ్నలకి నా దగ్గర జవాబు సిద్ధంగా లేదు. మౌనంగా ఊరుకున్నాను.

"ఇంత సహాయం చేస్తున్నందుకు, న న్నిలా నిలదీసి అడిగే హక్కు మీకు తప్పకుండా ఉంటుంది. నిజంగా చెప్తున్నాను. ఆమె ఎవరో నాకు తెలియదు. రెండు నెలల క్రితం ఓ రోజు బయటి నుంచి వచ్చి రూమ్ తాళం తియ్యబోతూ చూశాను. స్పృహ లేకుండా పడి ఉంది - గుమ్మం పక్కనే. జ్వరంతో ఒళ్ళు కాలిపోతోంది. అంత రాత్రప్పుడు - ఏం చెయ్యాలో, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఆమెను రిక్షాలో వేసుకొని గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించాను. ఈ దేశంలో - ఊరు, పేరూ లేని ఎంతోమంది అనాథల్లో ఆమె ఒకత్తె. అంతకంటే నాకేమీ తెలియదు. గవర్నమెంట్ హాస్పటల్ అన్న పేరేగాని - సగానికి సగం మందులు మనం కొనుక్కోవలసిందే. నేను వెళ్ళి నప్పుడల్లా తన బలహీన మైన చేతులు రెండూ జోడుస్తుంది - అంతే - అంతకంటే ఏమీ మాట్లాడదు. నేనూ ఆమెని ఏమీ అడగను. ఒళ్ళు తెలియని పరిస్థితిలో, నా గుమ్మంలో పడి ఉన్న ఓ దిక్కులేని దీనురాల్ని అలా వదిలేయలేక - 'గాడ్ - ఫాదర్' లాంటి ఓ వ్యక్తి దగ్గర ఆర్థిక సహాయాన్ని పొందుతూ, వైద్యం చేయిస్తున్నందుకు, చావు - బ్రతుకుల మధ్య రేపో - నేడో... అన్నట్టు ఉన్న ఆమెకూ, నాకు మధ్య ఉన్న సంబంధం ఏమిటని అడిగితే, నే నేమని చెప్పను గురువుగారూ? పోనీ... మీకు తెలిస్తే - దీన్ని ఓ కథగా రాసి... మీకు తోచిన పేరు పెట్టండి." నీళ్ళు నిండిన కళ్ళతో - చేతులు జోడించి - నెమ్మదిగా లేచి వెళ్ళిపోయాడు వరమేశం.

స్తబ్దమైపోయింది నా మనసు కొన్ని క్షణాలు. నెమ్మదిగా ఆ స్తబ్దతలోంచి పుట్టి, విశ్వమంత ఆక్రమించేటంత పెద్దదిగా పెరిగి నా ముందు నిలిచిం దొక ప్రశ్న.

ఔను ! దీనికి పేరేం పెట్టాలి?

మానవత్వపు విలువలూ, సామాజిక స్పృహ అంటూ ఇప్పటికి ఎన్నో కథలు రాసిన నేను-

తప్పనిసరిగా ఏర్పడిన రక్తసంబంధాల గురించి, స్వార్థంతోనో, మరెందుకో కావాలని ఏర్పరచుకొనే బంధాల గురించి కోకొల్లలుగా కథ లల్లిన నేను... కేవలం నిస్వార్థం, మానవత్వం లాంటి మంచి లక్షణాలే ఆలంబనయై ఏర్పడే ఇలాంటి అపూర్వమైన, అమూల్యమైన సంబంధాలకు పేరేమిటి పెట్టగలను? ఈ కథను... దీన్ని... ఏ పేరుతో పిలవను?

## పేలాలు పెట్టిన ఇండియన్లు

పాశ్చాత్యుల దృష్టిలో రెడ్ ఇండియన్లు అనాగరికులు. అయినా వారి దగ్గర ఎన్నిటినో తెలుసుకున్నారు వారు. అమెరికా గడ్డపైన కొలంబస్ కాలిడక ముందు ఇతర ప్రపంచానికి మిరపకాయలు తెలీవు. అందరూ కారం కోసం మిరియాల పొడినే వాడేవారు. అలాగే కోకో, బొప్పాయిలు వారి దగ్గర చూసి తెచ్చుకొన్నవే. ఇదేవిధంగా పేలాల గురించి మొదటిసారిగా వారు తెలుసుకున్నది ఉత్తర అమెరికాలోని రెడ్ ఇండియన్‌ల ద్వారానేనట. వారు జొన్నవంటి ఒక ధాన్యంతో పేలాలు చేసేవారట. వాటి రుచిమరిగి ఐరోపీయులు 1621లో జరుపుకున్న థాంక్స్ గివింగ్ డిన్నర్‌లో ప్రత్యేక వంటకంగా పడ్డించారట. అయితే భారతదేశానికి పేలాలు కొత్తవి కావు. వివాహ తంతులో వరి పేలాలు విధిగా ఉండవలసిందే. వీటిని 'లాజలు' అంటారు.

-కె. ఆర్. కె. మోహన్

